క్లుప్తంగా

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: రానున్న ఎన్నికలలో బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ గెలుపు కోసం కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం విఠల్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పాండురంగ్, మాజీ జెడ్పీటీసీ సోన్‌కాంబ్లే కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేస్తున్న బీఆర్ఎస్'



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బోథ్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా ఆరోపించారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగులు పట్టణాల నుంచి సొంత గ్రామాలకు రావాలని కోరారు. వచ్చి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వచ్చిన తరువాత నిరుద్యోగుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్సిఫ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రవీందర్ రెడ్డి

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాలను విశ్వసించొద్దన్నారు. అనారోగ్యం, ఇతర సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు రమణా రెడ్డి, దేవేందర్, మల్లేష్, శశి కుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు హెచ్‌బీఎన్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి సాగర్

ఇచ్చోడ: నవజాత శిశువుల రక్షణ కోసం ప్రభుత్వం హెచ్‌బీఎన్‌సీ కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తోందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లకు కిట్లను అందచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు ఈకిట్ల ద్వారా నవజాత శిశువుల అనారోగ్యాన్ని పరీక్షించవచ్చన్నారు. ఈ సందర్భంగా 39 కిట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొనండి

బోథ్: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఈనెల 19న ఆదిలాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువకులు పాల్గొనాలని బోథ్ సీఐ భీమేష్, ఎస్సై రాము సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

వీడీసీ కార్యవర్గం

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో మంగళవారం వీడీసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ ఖయ్యూం, ఉపాధ్యక్షుడిగా సురేశ్, కోశాధికారిగా సాయన్న, రైటర్‌గా నాగన్నను ఎన్నుకున్నారు. వీరికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆమె చేతుల్లోనే ఆరోగ్యం

- మహిళల్లో అవగాహన పెరిగేదెలా?
- ద్వితీయ సమావేశాలపై అధికారుల నిర్లక్ష్యం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



మహిళా సంఘం సభ్యుల సమావేశం (ఫైల్)

నేరడిగొండ: మహిళలకు ఆరోగ్యంపై అవగాహన ఉంటేనే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుంది. ఇదే ఉద్దేశంతో ప్రతినెలా ప్రత్యేకంగా ద్వితీయ సమావేశాలు నిర్వహించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ రెండేళ్ల కిందటే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో చాలా చోట్ల అమలు కావడంలేదు. మహిళల ఆరోగ్యానికి బాటలు వేసే ద్వితీయ సమావేశాలు పక్కాగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక్క సమావేశంతోనే..

మహిళా సంఘం సభ్యులు నెలకోసారి సమావేశమయ్యేవారు. పొదుపులు, అప్పులు, రుణ వాయిదాల చెల్లింపులపై చర్చలు జరిగేవి. రెండేళ్ల కిందటి వరకు ఇదే పరిస్థితి. ఆరోగ్యం పట్ల మహిళల్ని చైతన్యం చేయాలన్న లక్ష్యంతో నెలకోసారి నిర్వహిస్తున్న సమావేశానికి తోడు అదనంగా మరో సమావేశాన్ని నిర్వహించాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు నెలలో రెండుసార్లు సమావేశం కావాల్సిందే. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడంతో ఒక సమావేశంతోనే సరిపెడుతున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

చర్చించాల్సిందివే..

ద్వితీయ సమావేశంలో ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా ఉంటుంది. సంఘంలోని సభ్యులు, కుటుంబీకుల ఆరోగ్యంపై చర్చించాలి. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించాలి. అవసరమైతే ఆరోగ్య సిబ్బందిని సమావేశానికి ఆహ్వానించి సలహాలు, సూచనలు అందేలా చూడాలి. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో పెరటి తోటల్లో కూరగాయలు పండించే విధానంపై అవగాహన కల్పించాలి. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలి.

పొదుపు సంఘాలు	: 10749
సభ్యులు	: 116536
జిల్లాలో గ్రామైక్య సంఘాలు	: 557

ఏడాది కిందట అమలుపై సర్వే..

మహిళా స్వయం సహాయక సంఘాల స్థాయిలో నిర్వహిస్తున్న ద్వితీయ సమావేశాల అమలు తీరుపై పేదరిక నిర్మూలన సంస్థ ఏడాది కిందట సర్వే చేసింది. ఇందులో భాగంగా అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. జిల్లాలోని వివిధ మండలాల్లో బృందాలు పర్యటించి సర్వే నిర్వహించాయి. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామంలో ద్వితీయ సమావేశాల తీరును పరిశీలించారు. అధికారుల బృందం పర్యటన నేపథ్యంలో హడావుడి చేశారు. ఆ తర్వాత సమావేశాలపై పర్యవేక్షించే వారు కరవయ్యారు.

సక్రమంగా జరిగేలా చూస్తాం



మహిళా సభ్యులతోపాటు కుటుంబాల సంఘాల వారి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడమే సమావేశాల లక్ష్యం. సమావేశాలు సక్రమంగా జరిగేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశిస్తాం. సంఘంలోని సభ్యుల్లో ఎవరికైనా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉంటే అందరూ చేయూతనందించాలి.

– కిషన్, డీఆర్‌డీఏ పీడీ

కాంగ్రెస్ మేనిఫెస్టో చెల్లని రశీదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: కాంగ్రెస్ మేనిఫెస్టో చెల్లని రశీదు అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. మంగళవారం మండలంలోని భోరజ్ ఎక్స్ రోడ్ సమీపంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో మాట్లాడారు. అంతకు ముందు ఆదిలాబాద్ మండలం జందాపూర్ నుంచి భోరజ్ వరకు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కర్ణాటకలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో ప్రతి ఇంటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, రోకండ్ల రమేశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన



కార్యకర్తలతో అనిల్ జాదవ్

తాంసి: బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం నేరడిగొండలోని అనిల్ జాదవ్ నివాసంలో భీంపూర్ మండలంలోని అంతర్గాం, ధనోర మాజీ సర్పంచ్‌లు ప్రకాష్, శంకర్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లింబాజీ, వైస్ ఎంపీపీ లస్మన్న, నాయకులు నాగయ్య, సంతోష్, అనిల్, స్వామి, సంజీవ్ రెడ్డి, అఫ్రోజ్, మెట్టు కిరణ్ పాల్గొన్నారు.

దుర్గామాతాకు పూజలు

నేరడిగొండ: దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలో దుర్గామాతా కొలువుదీరింది. మంగళవారం అనిల్ జాదవ్ మండలంలోని వాంకిడి గ్రామంలో దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అనిల్ వెంటే ఆదివాసీలు

నేరడిగొండ: బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆరెపల్లి గ్రామస్తులు ప్రకటించారు. మంగళవారం సర్పంచ్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్ సింగ్, ఆదివాసీలు పాల్గొన్నారు.

'గడపగడపకూ బీఆర్ఎస్' విజయవంతం చేయండి

తలమడుగు: గడపగడపకు బీఆర్ఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్, అబ్దుల్లా, జీవన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మహేందర్ యాదవ్, ప్రకాష్, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీకి అనుమతి ఇవ్వాలని వినతి

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఈనెల 28న శ్రీ వాల్మీకి మహర్షి రథయాత్ర నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో తహసీల్దార్ పరిమల్ బౌమిక్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై లింబాద్రికు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఐబీ చౌరస్తా నుంచి శివాజీనగర్ కాలనీ మహాలక్ష్మి ఆలయం వరకు రథయాత్ర సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకుల నారాయణ, నర్ర చందు, శేఖర్, అడప విలాస్, ఆకుల రమేశ్, కంసాని కృష్ణ, మహేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నార్నూర్: వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. మంగళవారం మాన్కాపూర్ పరిధిలోని రాజులగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు వైరల్ జ్వరాల బారీన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు అరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, ఏఎన్ఎం శీలా, హెచ్ఏ ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు మంటలను ఆర్పి వేయాలి

బోథ్: బోథ్ పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డులో గత ఐదురోజులుగా మంటలు చెలరేగుతున్నాయని ఎంపీటీసీ షేక్ రజియా బేగం అన్నారు. మంటలు చెలరేగి దట్టంగా పొగలు వస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ సిబ్బంది వెంటనే మంటలను ఆర్పి వేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్, హౌజ్ వైరింగ్ విభాగంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26న ఉదయం 9గంటలకు కేబీ ప్రాంగణంలోని ఆర్‌సెటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99494 12159 సంప్రదించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కలశయాత్ర

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నాదేశం.. నామట్టి కార్యక్రమంలో భాగంగా కలశయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చేరాల లక్ష్మణ్, అధ్యాపకులు గణేశ్, దశరథ్, శ్రీలత, తిరుపతి, రూప, వినోద్, కేవీ కేశవులు, కిషోర్, నవీన్, శ్రీనివాసరావు, సువర్ణ పాల్గొన్నారు.

పత్తి సాగులో జాగ్రత్తలు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

తాంసి: పత్తి సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని డీఏవో పులయ్య అన్నారు. మండల శివారులో పత్తి పంటలను మంగళవారం పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల పిచికారీ, సూచనలు చేశారు. అనంతరం క్రాప్ బుకింగ్‌లో భాగంగా నమోద్ చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వెంట ఏఈవో నిఖిత, రైతులు దేవారెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లేశ్

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మోహిద్ అధ్యక్షతన నిర్వహించిన ఖానాపూర్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు ఎంపీడీవో బాలే మల్లేశ్ మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశాన్ని గంటలోనే ముగించేశారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ వాల్‌సింగ్, పలువురు ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం బతుకమ్మ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రవీణ్ రెడ్డి, కార్తీక్, ముత్యం, సతీష్, ప్రసాద్, స్వామి, మహేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. డీఐఈవో రవీందర్ కుమార్ బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి, సంబురాలను ప్రారంభించారు. విద్యార్థినులు, అధ్యాపకులతో కలిసి బతుకమ్మ పాటలపై నృత్యం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, సూపరింటెండెంట్ మోహసిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మకు పూజలు చేస్తున్న డీఐఈవో



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు రాత్రి దాండియా నృత్యం చేస్తున్నారు. మంగళవారం భీంజితండాలో దుర్గాదేవి ఆలయంలో బండార కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపెద్దలు జాదవ్ హచ్చునాయక్, సర్పంచ్ రాథోడ్ రాంచందర్, లాలు, జాదవ్ ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరుద్ర సహిత చండీయాగం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో మంగళవారం శ్రీరుద్ర సహిత చండీయాగాన్ని నిర్వహించారు. ఇటీవల ఛార్ ధాం యాత్రను పూర్తి చేసిన పలువురు భక్తులు ఆలయంలో చండీయాగంతో పాటు శివపార్వతుల కల్యాణం, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బోథ్: మండలంలోని సొనాల రామాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళల మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

'సమస్యల పరిష్కారంలో విఫలం'



మాట్లాడుతున్న రాంకిషన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగెస్ నాయకులు, పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ రాంకిషన్ నాయక్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని కోపర్‌ఘడ్, సాలెవాడ(కె), గంగుగూడ, పులిముడుగు, కుమ్మరితండా, ఏంద, ఎక్స్‌రోడ్డు, శ్యాంపూర గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజియాగర్, దత్తరాం, కనక రావు, లక్ష్మీకాంత్, ప్రకాశ్, జైసింగ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పార్టీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ సోయం బాపురావు

తాంసి: ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జోరుగా పార్టీలు మారుతున్నారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రకాష్, బీజేపీ కార్యకర్తలతో బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాగా.. అంతర్గాం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ సోయం బాపురావు, జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారుతున్నారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు.